గ్రామసభలు విజయవంతం

పార్వతీపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2024-25లో చేపట్టనున్న పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 451 పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలు విజయవంతమయ్యాయి. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు ఉపాధి పనులు, ప్రాధాన్యతలను తొలుత వివరించారు. ఈ ఏడాది గ్రామంలో చేపట్టాల్సిన పనులను సభ ముందుంచి ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించారు. తహసీల్దార్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యశాఖ పనితీరు భేష్

- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



జిల్లా కేంద్రాసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి)/బెలగాం: జిల్లాలో వైద్యశాఖ పనితీరు సంతృప్తికరంగా ఉందని, వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పార్వతీపురంలోని జిల్లాకేంద్రాసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం వైద్య శాఖ సిబ్బందితో సమీక్షించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి కావలిసిన సదుపాయాలు, ఇతర సమస్యలను వైద్యాధికారులు తెలియజేశారు. సిబ్బంది కొరత, అంబులెన్స్ కండీషన్స్, ఫీడర్ అంబులెన్స్‌ల పరిస్థితిని వివరించారు. ఆసుపత్రిలో మృతి చెందిన వారిని తీసుకెళ్లేందుకు అంబులెన్స్ కావాలని కోరారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వైద్య సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో మలేరియా, రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దోమల నివారణకు గాను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్త సేకరణలో భాగంగా పాలకొండలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. త్వరలో సాలూరులోనూ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ఏ స్థాయిలో ఉన్నాయో వివరించారు. పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ.. జిల్లాకు అంబులెన్స్‌లు, ఫీడర్ అంబులెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని మంత్రిని కోరారు. ఈ సమీక్షలో ఆరోగ్య కుటుంబ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్, ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ సిరి, ఆర్డీవో కె.హేమలత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి, నోడల్ అధికారి వినోద్, ఏపీ ఎన్జీవో నాయకులు జీవీఆర్ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించరా?

పార్వతీపురం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి)/సీతానగరం: సీతానగరంలో పీహెచ్‌సీ భవన నిర్మాణాలను ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. అయితే పనుల నాణ్యతా లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాలను పరిశీలించరా? అని ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. వివిధ కారణాలతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు ఇంజినీర్ అధికారులు తెలిపారు. ఏదేమైనా నాణ్యత ప్రమాణాలతో పనులు జరిపించాలని, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఆయన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మందుల స్టోర్ గది, ఓపీ రికార్డులను పరిశీలించారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న ఫైలేరియా సమస్యను ఎమ్మెల్యే విజయచంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం పీహెచ్‌సీ భవన నిర్మాణాల నాణ్యత లోపంపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



కూర్మరాజుపేటలో డప్పు కొట్టి సందడి చేస్తున్న మంత్రి

పల్లెలకు ప్రత్యేక బ్రాండ్

- సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం
- పంచాయతీలకు జవసత్వాలు
- మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్,ఆగస్టు 23: సంపదను సృష్టించి అభివృద్ధి చేయడం సీఎం చంద్రబాబునాయుడుకే సాధ్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గ్రామాలకు ప్రత్యేక బ్రాండ్ తెస్తామన్నారు. కూర్మరాజుపేటలో శుక్రవారం సర్పంచ్ ఎ.నళిని అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. 'పంచాయతీలకు జవసత్వాలు కల్పిస్తాం. ఆర్థిక సంఘం నిధులను నేరుగా సర్పంచ్ ఖాతాల్లో వేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉద్యోగాలిస్తాం. నీటి పునర్వియోగంపై దృష్టి సారిస్తాం. సోషల్ ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం. గత వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను పీడించింది. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి.. పంచాయతీలను నిర్వీర్యం చేసింది. చెక్ పవర్ హక్కు ఉన్న సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేసింది. ధాన్యం, మొక్కజొన్న, పత్తి వంటి కొనుగోలు కేంద్రాలను పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఎక్కడా మొక్కలు నాటలేదు. జగన్ పర్యటన సమయంలో చెట్లను కొట్టించారు.' అని తెలిపారు. మొక్కలు నాటడం తెలియని వారికి చెట్లు కొట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్పీ భంజ్ దేవ్, నాయకులు పరమేశు, తిరుపతిరావు, తహసీల్దార్ రమణ, ఎంపీడీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

డప్పు కొట్టి సందడి

కూర్మరాజుపేటలో మంత్రి సంధ్యారాణికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. మేళాతాళాలతో పొలిమేర నుంచి గ్రామసభ వేదిక వద్దకు తీసుకెళ్లారు. చిన్నారులు ప్రత్యేకంగా పూలిచ్చి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి డప్పు కొట్టి సందడి చేశారు.

పనులపై ప్రణాళికలు..

గరుగుబిల్లి : ప్రజలందరి భాగస్వామ్యంతో అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయనున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. సంతోషపురం గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం అమలులో ప్రభుత్వం సరికొత్త ఒరవడిని తీసుకొచ్చిందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పనిదినాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎతవిటి నాయుడు , ఎంపీడీవో పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: కలెక్టర్

పార్వతీపురం రూరల్ : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఎమ్మార్ నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన మట్లాడుతూ.. పల్లెల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై చర్చించి.. పనులను గుర్తించాలని కోరారు. సర్పంచ్ లక్ష్మి, డ్వామా పీడీ రామచంద్రరావు, ఎంపీడీవో షేక్ అబ్దుల్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఉపాధి నిధులతో...

వీరఘట్టం : ఉపాధి నిధులతో గ్రామాల్లో రహదారులు, కాలువలు, చెక్‌డ్యామ్‌లు, రైతులకు ఉపయోగపడే పంట కాలువలు నిర్మిస్తామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. వీరఘట్టంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. వీరఘట్టంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో గోపాలకృష్ణ, ఏపీవో సత్యంనాయుడు, ఇన్‌చార్జ్ డీటీ సత్యనారాయణ, పంచాయతీ ఈవో రాము, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్‌తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సహకార సంఘాలు సరికొత్త బాటలో..

- పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు
- శరవేగంగా కంప్యూటరీకరణ
- రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

గరుగుబిల్లి, ఆగస్టు 23 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) నిర్వీర్యమయ్యాయి. వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండేది. రైతులకు కూడా పూర్తిస్థాయిలో సేవలు అందేవి కావు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు వాటికి స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు పలు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే సంఘాల పరిధిలో కంప్యూటరీకరణ ప్రారంభమైంది. రైతుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఎటువంటి లోపాలు, తప్పులకు అవకాశం లేకుండా పక్కాగా ఈ ప్రక్రియ చేపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 35 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వాటిల్లో 89,668 మంది సభ్యులు ఉన్నారు. సభ్యత్వం ఉన్నవారికి సంఘం పరిధిలో వ్యవసాయ రుణాలతో పాటు పలు రకాల రుణాలు మంజూరు చేస్తున్నారు. కాగా జిల్లాలో సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సీఈవోలు, సిబ్బంది కేవైసీ చేయడంలో నిమగ్నమయ్యారు. సంఘ పరిధిలో సభ్యత్వం పొందిన వారి పూర్తి సమాచారం పొందుపరుస్తున్నారు. సంఘ పరిధి నుంచి ఎంతమేర రుణం పొందారు, భూవిస్తీర్ణం ఎంత ఉందన్న వివరాలు కంప్యూటర్లలో నమోదు చేస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక..

జిల్లాలో పలు సంఘాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. వాటిల్లో పార్వతీపురం పీఏసీఎస్, బందలుప్పి, పెదబొండపల్లి, బలిజిపేట, పలగర, గలావిల్లి, కురుపాం పరిధిలో టీజే పురం, చినమేరంగి, కురుపాం, దుడ్డుఖల్లు, గరుగుబిల్లి, కొమరాడ, కృష్ణపల్లి, రావివలస, శివిని, సాలూరు, చెముడు, కేసలి, మక్కువ, మామిడిపల్లి, మోసూరు, పెదపదం, శంబర, శివరాంపురం, వెంకటభైరిపురం, సీతానగరం, అజ్జాడ, అంటిపేట, బూర్జ, గెడ్డలుప్పి, గుచ్చిమి, కాశీపేట, మరిపివలస, పాపమ్మవలస, ఆర్.వెంకమ్మపేట, తామరఖండి సంఘాలు ఉన్నాయి.

- పీఏసీఎస్‌ల స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే రైతుల సమాచారాన్ని జాతీయ స్థాయిలో అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానంగా పారదర్శకతను పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. కంప్యూటరీకరణతో రైతుల్లో విశ్వసనీయత పెరిగే అవకాశం ఉంది. సంఘాల కార్యకలాపాల సామర్థ్యం పెంచడంతో పాటు రుణాలు మంజూరు, పంపిణీ, లావాదేవీలు, నిర్వహణ ఖర్చులు, చెల్లింపుల్లో సమస్యలను తగ్గించడం వంటి విధానాలు అమలు కానున్నాయి. రుణాల రీషెడ్యూల్‌కూ ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రధానంగా మాన్ అకౌంటింగ్ సిస్టమ్ (సీఏఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్)ల అమలు ద్వారా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. బ్యాంకుల మాదిరిగా పీఏసీఎస్‌లు రూపుదిద్దుకోనున్నాయి. కాగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పూర్తి సమాచారాన్ని పొందుపర్చేందుకు ఈ నెలాఖరు వరకు గడువు విధించారు.

అక్టోబరు 2 నుంచి ఆన్‌లైన్ వ్యవస్థ

పీఏసీఎస్‌ల నుంచి తీసుకున్న రుణానికి ఎంత చెల్లించాం? ఇంకా ఎంత పెండింగ్ ఉంది? అనేదానిపై రైతుల్లో ఇప్పటి వరకూ స్పష్టత ఉండేది కాదు. అంతా మాన్యువల్‌గా జరిగేది. సిబ్బంది ఎంత చెల్లించమంటే అంతే చెల్లించడం తప్ప, ఒక రసీదు కూడా ఇచ్చే సందర్భాలు లేవు. మరోవైపు బినామీ రుణాలు కూడా ఎక్కువగా ఉండేవి. ఈ నేపథ్యంలో పీఏసీఎస్‌ల కంప్యూటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. అందుకనుగుణంగా ఆన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదు ప్రక్రియ జరుగుతుంది. అక్టోబరు 2 నుంచి ఆన్‌లైన్ వ్యవస్థ అమలు కానున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.



గరుగుబిల్లి పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ చేస్తున్న సీఈవో, సిబ్బంది

గడువులోగా పూర్తి చేస్తాం

ఈ నెల 30లోగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం. 35 సంఘాల పరిధిలో 89,668 మంది సభ్యులకు గాను 25,089 మందికి పైగా సమాచారం పొందుపర్చాం. సంఘాల పరిధిలో సిబ్బంది కొరత ఉంటే సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకోనున్నాం. కంప్యూటరీకరణపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నాం. గతంలో ఉన్న వారి వివరాలనే నమోదు చేస్తున్నాం. నూతనంగా సభ్యత్వం పొందిన వారికి అవకాశం లేదు. దీనిపై ప్రభుత్వ ఆదేశాలివ్వాల్సి ఉంది.

\- పి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహకార అధికారి, పార్వతీపురం మన్యం



అంతటా శ్రావణ శోభ

- భక్తిశ్రద్ధలతో వ్రతాలు, పూజలు
- అమ్మవారి ఆలయాలు కిటకిట



పూజలందుకున్న పోలమాంబ



బంగారుచీరలో వాసవీమాత



సాలూరులో వెండిచీరతో దర్శనమిచ్చిన కామాక్షి అమ్మవారు

సాలూరు/ రూరల్/మక్కువ/పాలకొండ, ఆగస్టు 23: శ్రావణ మూడో శుక్రవారం సందర్భంగా జిల్లాలో ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని సామూహిక కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలను నిర్వహించారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 2వేల మంది మహిళలు ఈ కుంకుమార్చన పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శంబర పోలమాంబ చదురుగుడిలోనూ సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అమ్మవారి ఫొటో, పసుపు, కుంకుమలు అందజేశారు. సాలూరులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు బంగారుచీరతో, కామాక్షి అమ్మవారు వెండి చీరతో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మహిళలు కుంకుమ పూజలను చేశారు.



సాలూరు కామాక్షి అమ్మవారి ఆలయంలో ...



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శనివారం • 24 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



మహేశ్ సినిమా పేరు అదేనా?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

సమంతకు ఏమైంది?




సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్లుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

రవితేజకు శస్త్ర చికిత్స



హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరఫున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ ఢిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ ఆర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్



కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జెన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తక్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరా గాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నో సార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదల్లేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్ధరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.

గ్రామాలకు మళ్లీ మహర్దశ

● విశాఖ ఎంపీ శ్రీభరత్ ● జిల్లా వ్యాప్తంగా పండగలా గ్రామ సభలు



కొత్తవలస: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ భరత్

కొత్తవలస, ఆగస్టు 23: గ్రామాలకు మళ్లీ మహర్దశ వచ్చిందని విశాఖ పట్టణం ఎంపీ శ్రీభరత్ అన్నారు. శుక్రవారం కొత్తవలస నాలుగు సచివాలయానికి సంబంధించిన గ్రామ సభలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికోసం వేల కోట్ల రూపాయలను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా సీపీఎం, సీపీఐ నాయకులు ఉపాధికి సంబంధించిన పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని, వేతనాన్ని 600 రూపాయలకు పెంచాలని కోరారు. కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పనులకు ఆమోదం చేసి గ్రామాలను మెరుగుపరుచుకోవాలన్నారు.

బురదలో ద్విచక్రవాహనంపై..

● డీకేపర్తి గ్రామసభకు ఎంపీ కలిశెట్టి



బురదలో ద్విచక్రవాహనంపై గ్రామసభకు వెళ్తున్న ఎంపీ కలిశెట్టి

గంట్యాడ: డీకేపర్తిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. అయితే రహదారి సదుపాయం లేని ఈ మారుమూల గిరిజన గ్రామానికి ఆయన కొంత దూరం నడిచి.. మరికొంత దూరం బురదలో ద్విచక్రవాహ నంపై ప్రయాణించి వెళ్లారు. నక్సల్స్ ప్రభావి త ప్రాంతం కావడంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ సభకు చేరుకున్నారు. గ్రామస్థుల సమస్య లను తెలుసుకున్నారు. అనంతరం అక్కడి పాఠ శాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని, గ్రామంలోని సమస్యలను పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీవో భవాని, ఎస్ఐ సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి: బేబీనాయన

రామభద్రపురం: గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని కోటశిర్లాం గ్రామంలో శుక్రవారం మనపంచాయతీ-మన సాధికారత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆరికతోట గ్రామంలో వివిధ సమస్యలు, కాలువలు, కల్వర్టులు, పొలానికి నీరు వెళ్లే కాలువల నిర్మాణాలకు అంచనాలు వేసి నోడల్ అధికారి సత్యారావుకు అందించారు.

పంచాయతీల అభివృద్ధికి ముందడుగు: కోళ్ల

లక్కవరపుకోట: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన గ్రామసభలు గ్రామాల అభివృద్ధికి ముందడుగని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఎల్.కోటలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ ప్రసాదరావు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** గ్రామ సభలల్లో గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారీ సూచించారు. మండ లంలోని బొద్దాం గ్రామ పంచాయితీలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. సర్పంచ్ యర్ర రామసత్యవతి, మాజీ సర్పంచ్ జనపరెడ్డి ఈశ్వర రావు, నాయకులు జనపరెడ్డి శ్రీను, పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** పంచాయతీలను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఎస్.కోటలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ సంతోష్‌కుమారి, ఉపసర్పంచ్ మోపాడ కుమార్ పలు ప్రతిపాదనలు వివరించగా వీటిపై ప్రత్యేక సమావేశం పెడదామన్నారు.

చంద్రబాబు పాలనలో గ్రామ స్వరాజ్యం : కోండ్రు

రాజాం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో గ్రామ స్వరాజ్యం మొదలయ్యిందని మాజీ మంత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. శుక్రవారం మండలం శ్యాంపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్ కృష్ణంరాజు, పార్టీ నాయకులు సుమల మన్మథరావు, గురవాన నారాయణరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి: కళా

చీపురుపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు విజ్ఞప్తి చేశారు. పీకే పాలవలసలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో కుప్పకూలిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు జవసత్వాలు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామచంద్రుడు, కామునాయుడు, ఎంపీడీవో కె.రామ కృష్ణరాజు, ఈవోపీఆర్డీ కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. చీపురుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, ఇతర అధికారులకు తెలుగుదేశం, జనసేన నాయకులు గ్రామ సమస్యలను వివరించారు.

అవసరమైన పనులకే తీర్మాణం: జేసీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కే మధుసూదనరావు ఆధ్వర్యంలో విజయనగరం జేసీ సేతు మాధవన్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంతవరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మరుగుదొడ్లు, కుళాయిలు, విద్యుత్, వంటగ్యాస్ కనెక్షన్లు, మురుగు నీరు, వీధి దీపాలు, సిమెంట్ రహదారుల గురించి ఎవరికైనా ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. గ్రామస్థుల వద్దనుంచి వినతులు తీసుకొని ఎలాంటి పనులు అవసరమో గుర్తించి తీర్మానాలు చేయాలని మండల ప్రత్యేక అధికారి కే మధుసూదనరావు కి ఆదేశించారు.



రామభద్రపురం: కోటశిర్లాం సభలో బేబీనాయన



ఎల్.కోట గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల



రాజాం: శ్యాంపురంలో కోండ్రు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



బొబ్బిలి రూరల్: పారాధి గ్రామసభలో జేసీ

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి

కొత్తవలస: గర్భిణులు హెచ్ఐవీ, సిఫిలిస్ వంటి సుఖ రోగాలపై పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి సూచించారు. మండలంలోని వీరభద్రపురం గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై వియ్యంపేట వైద్యాధికారి గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. గర్భిణులు ఈ పరీక్షలు ముందుగానే చేయించుకోవడం వలన పిల్లలకు సోకకుండా చర్యలు తీసుకునే వీలుందన్నారు.

సోమవారం గ్రీవెన్స్ రద్దు

కలెక్టరేట్: కృష్ణాష్టమి సెలవు కారణంగా ఈనెల 26న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్ సెల్) రద్దు చేస్తున్నట్లు డీఆర్వో అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'బ్లీచింగ్ కొనుగోళ్లు పేరుతో పది లక్షలు స్వాహా'

జామి: మండలంలోని లొట్లపల్లి పంచాయతీలో గత ప్రభుత్వం గ్రామంలో ఎటువంటి శానిటేషన్ పనులు చేయించకుండా బ్లీచింగ్ కొనుగోళ్లకు సుమారు రూ.పదిలక్షలు ఖర్చుచేసినట్లు రికార్డులు చూపిస్తున్నారని దీనిపై జిల్లా పంచాయతీ అధికారి పూర్తిస్థాయి విచారణ జరిపి నిధులు దుర్వినియోగం చేసినవారిపై చర్యలు చేపట్టాలని గ్రామ యువత గ్రామసభకు వచ్చిన మండల ప్రత్యేకాధికారి రాంగోపాల్‌కు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా జన్నెల బాలకృష్ణ ఆధ్వర్యంలో వారు మట్లాడుతూ తాము సమాచార హక్కుచట్టం ప్రకారం తీసుకున్న వివరాల్లో ఈవిషయం బయటపడిందన్నారు. ఇదేవిషయంపై పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మ మాట్లాడుతూ బ్లీచింగ్‌కు పదిలక్షలు ఖర్చుపెట్టామనడం అవాస్తమమని, తమది చాలా చిన్నపంచాయతీ అని తెలిపారు. వారి ఆరోపణలు నజం కాదన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడాలి

రాజాం రూరల్: ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపడాలని మండల విద్యాశాఖాధికారి దుర్గారావు స్పష్టం చేశారు. బోధన తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గుయ్యానవలస పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రెండు భవనాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని ఉపాధ్యాయులు చిరంజీవి, సృజన, ఎంఈవో దుర్గారావు దృష్టికి తీసుకువచ్చారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికల హవా

రామభద్రపురం: ఈనెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరికతోట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలురలో ఎం.జ్యోతి ప్రకాష్, డి.రాఘవ, బాలికల్లో భువనేశ్వరి, మధురిమ, జయశ్రీలు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. వీరిని హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించండి

విజయనగరం రూరల్: స్థానిక పద్మావతి నగర్‌కు చెందిన కరక నాగరత్నం తాను నివసిస్తున్న పద్మావతి నగర్ బిట్-1, ఫ్లాట్ నెం 225లో ఉన్న ఇంటి స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోలగట్ల, ఆయన అనుచరులు ఈ స్థలం ఖాళీ చేయాలని పదే పదే ఒత్తిడి తెచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాను నివాసం ఉంటున్న ఇంటికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా టీడీపీ

రాజాం: అచ్యుతాపురంలో చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వంగర మండలం కోణింగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణను కోండ్రు మురళీమోహన్ శుక్రవారం రాత్రి విశాఖలో గల ఇండస్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ముగ్గురు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మాసిటీలో 18 మంది మృతికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎ సురేష్, ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి కార్యాలయ ప్రతినిధికి వినతిపత్రం అందించారు.

ప్రధాన పనులకు ప్రతిపాదనలివ్వండి

రాజాం: పనుల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు ప్రతిపాదనలు అందజేయాలని కంచరాం యూత్ సభ్యులు గ్రామసభలో పెద్దలకు వినతిపత్రం అంద జేశారు. గెడ్డాపు అప్పలనాయుడు తదితరులున్నారు.

మంత్రి సత్యకుమార్ దృష్టికి సమస్యలు

● బొబ్బిలి కోటకు ఆహ్వానించి వివరించిన బేబీనాయన



ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌కువినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బొబ్బిలి కోటలోని తన నివాసానికి శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బేబీనాయన ఆహ్వానించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలోని ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 50 పడకల ఆసుపత్రిగా బొబ్బిలి సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేశారని, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఆ పనులను పూర్తి చేయలేక అర్ధాంతరంగా వదిలేసిందని మంత్రికి తెలిపారు. పరిపాలనా పరమైన అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే బేబీనాయన మంత్రిని కోరారు. ఈ మేరకు స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.శశిభూషణరావుతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు తెంటు రవిబాబు, పెంట సత్తిబాబు, కాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పార్వతీపురం మన్యం జిల్లా అధికార కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని ఆయనను కలిసి గజపతినగరం ఏరియా ఆసుపత్రికి అదనపు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ సజావుగా జరగాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. కొనుగోలుకు అవసరమగు వాహనాలు, గన్నీ సంచులు, హమాలీలు, తేమ యంత్రాలు, గొడౌన్ సామర్థ్యం, బ్యాంకు గ్యారంటీలు తూనిక యంత్రాలు తదితర సామగ్రిని నెల రోజుల ముందే ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబం ధించి ఆయా శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ ఏడాది 4.50 లక్షలు మెట్రిక్ టన్నులు పంట వస్తుందని అంచనా వేస్తున్నామని, ప్రభుత్వం 4 లక్షలు మెట్రిక్ టన్నులు సేకరించా లని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వ్యవసాయాధికారులు అత్యంత బాధ్యత గా పని చేయాలన్నారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన టైం లైన్ ప్రకారంగా ధాన్యం సేకరణ జరిగేలా సమన్వయంతో పని చేయాలన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలపై బకాయిలపై ప్రభుత్వంకు లేఖ రాసి పరిష్కరించడం జరుగు తుందన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మీనా కుమారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీఎస్‌వో మధుసూదనరావు తదితరులు ఉన్నారు.


డ్రగ్స్, గంజాయి నియంత్రణపై సదస్సు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: సమాజంలో పెచ్చుమీరిపోతున్న అసాంఘిక కార్యకలాపాలను అణగదొక్కాలని నినదిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి లోకం శుక్రవారం బొబ్బిలి పట్టణంలో కదంతొక్కింది. అమ్మాయిలపై అత్యాచారాలను అరికట్టాలని, డ్రగ్స్, గంజాయి ఆనవాళ్లు లేకుండా పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీవేణుగోపాలస్వామి మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేరాలకు సంబంధించిన పలు చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకతాయిలు నేరప్రవృత్తి కలిగిన వారిని దూరంగా ఉంచాలన్నారు. సేవను పెంపొందించుకోవాలన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఏవ్యక్తి అయినా మహిళలపట్ల చెడు భావంతో చూడరాదన్నారు. సోదరభావం కలిగి ఉండాలన్నారు. ఇలాంటి దురాగతాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ నేత విజయగౌరి మాట్లాడుతూ పాలబుగ్గల పసిపిల్లలతో సహా 80 ఏళ్ల దాటిన వృద్ధులను సైతం విడిచిపెట్టకుండా కామాంధులు చెలరేగిపోతున్నారన్నారు. మన సమాజం ఎటుపోతోంది? అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లోవరాజు,ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణికుమార్, శివ, జానీ, చరణ్, నాగరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి దామోదరరావు

బొబ్బిలి: స్థానికకోర్టు సముదాయంలో శుక్రవారం పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసు, ఎస్ఈబీ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 14న జరగనున్న జాతీయలోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవా సమితి చైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణి రావు, డీఎస్పీ శ్రీనివాసరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం, ఇతర న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే వ్యక్తి.. 70 కేసులు

● చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై 70 కేసులు ఉన్నట్టు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలివీ.. బాలాజీ నగర్‌లోని ఇందూ రెసిడెన్షియల్‌లో ఈ నెల 10న ఇంట్లోని వెండి వస్తువులు, 12న శ్రీనివాసా కళాశాల సమీపంలోని ఒక ఇంట్లో రూ.లక్ష విలువైన వాచీ, కొంత నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేర కు నగరంలోని లాడ్జీలను, వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో తె లంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం తట్టుపోతల బంగారం గ్రామా నికి చెందిన దుద్దెడ లింగం అనే వ్యక్తిని శుక్రవారం రైల్వే స్టేషన్ సమీపంలో అదుపు లోకి తీసుకున్నారు. అతనిని విచారించగా, దొంగతనాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.లక్ష విలువైన వాచీ, ఇయర్ ప్యాడ్స్, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిపై 70కి పైగా కేసులు ఉన్నాయని వెల్లడించారు. చాలా కేసుల్లో శిక్ష అనుభవించాడన్నారు. ఐదు నెలల క్రితం జైలు నుంచి బయటకు వచ్చి దొంగతనాలు చేస్తూ మళ్లీ పట్టుబడ్డాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన క్రైం ఎస్ఐ తారకేశ్వరరావు, హెచ్‌సీ అచ్చి రాజు, పీసీ గౌరీశంకర్, సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు అభినందించారు.

పాముకాటుతో గొర్రెలు మృతి

తెర్లాం: మండలంలో వి.చిన్నయ్యపేటలో పాముకాటుకు గురై 3 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రైతు వెన్నెల రమణ, అప్పలస్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజులాగే గొర్రెలను మేతకు తీసుకెళ్లామని, గ్రామంలోని ఓ తోటలో గొర్రెలు మేస్తుండగా ఒక్కసారిగా 3 గొర్రెలు కుప్పకులాయని, వెళ్లి చూసేసరికి పక్కనుంచి పాము వెళ్తుండం గమనించామని వారు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి-బోడసింగిపేట గ్రామాల మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందినట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావు శుక్రవారం తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతునివద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం మహరాజ ఆసుపత్రిలో భద్ర పరిచామని, మృతుని చేతిపై ఇంద్రాదేవి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9666122722, 9491813163 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గరివిడి: గరివిడి రైల్వే స్టేషన్ సమీపంలో నెల్లిమర్ల వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. మృతునికి సుమారు 64 సంవత్సరాలు ఉండవచ్చునని, కాషాయ రంగు పంచె, తెలుపు రంగు షర్టు ధరించాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

బొబ్బిలిలో జేసీ పర్యటన

● ఇసుక పంపిణీపై కొరడా ● కెమికల్ ఫ్యాక్టరీ పరిశీలన



బాలాజీ పరిశ్రమను పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

బొబ్బిలి, ఆగస్టు 23: జేసీ సేతుమాధవన్ శుక్రవారం బొబ్బిలిలో సుడిగాలి పర్యటనతో అధికారులను, సిబ్బందిని పరుగులెత్తించారు. పారాదిలో గ్రామసభకు వెళ్లి వచ్చిన తరువాత స్థానిక గ్రోత్‌సెంటరులో గల బాలాజీ కెమికల్స్ ఫ్యాక్టరీని పరిశీలించారు. 2019 లో ఈ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి ఇద్దరు మృతి చెందగా మరి కొంతమంది గాయపడిన సంగతి తెలిపారు. అనకాపల్లి సెజ్‌లో ఫార్మాకంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జేసీ బొబ్బిలిలో గల బాలాజీ కెమికల్స్‌ను తనిఖీ చేశారు. కార్మికులకు ప్రాణరక్షణ చాలా అవసరమని, ఇందులో ఎటువంటి రాజీ లేదని జేసీ హెచ్చరించారు. అగ్నిమాపక అనుమతుల కోసం ఈ కంపెనీ యాజమాన్యం చేసుకున్న దరఖాస్తును అగ్నిమాపక శాఖ అధికారి తిరస్కరించడంతో పూర్తిస్థాయి నిబంధనలతో దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు. ● స్థానిక గ్రోత్‌సెంటరులో గల ఇసుకస్టాకు పాయింట్‌ను జేసీ రెండు రోజుల వ్యవధిలోనే మరోసారి తనిఖీ చేశారు. ఇసుక పంపిణీకి సంబంధించి జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీల ఆధ్వర్యంలో రూపొందించిన మార్గదర్శకాల మేరకే ఇసుక పంపిణీ జరగాలన్నారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు జీపీఎస్ అమలు చేయాలని జేసీ ఆదేశించారు. అనుమతి తీసుకున్నవారు మాత్రమే ఇసుక తరలిస్తున్న లారీని జేసీ నిలుపుదల చేశారు. ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారు సెల్ఫీలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇసుక పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ● బొబ్బిలి అర్బన్‌డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని వైస్‌చైర్మన్, ఇన్‌చార్జి హోదాలో జాయింట్ కలెక్టరు సందర్శించారు. తహసీల్దారు ఎం.శ్రీను, సీఐ సతీష్‌కుమార్, ఆర్ఐ కళ్యాణచక్రవర్తి, ఇతర రెవిన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

గుర్ల, ఆగస్టు 23: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడు(43) మద్యం మత్తులో మృతిచెందినట్లు శుక్రవారం పోలీసులు గుర్తించారు. గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడుకు గోశాడ గ్రామానికి చెందిన సత్యవతితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. మద్యానికి బానిస కావడంతో భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు సాగుతున్నాయి. వీరి వివాదం పోలీస్‌స్టేషన్ వరకూ చేరింది. పెద్దలు ఇరువురినీ ఒప్పించే ప్రయత్నాలు సైతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం సన్యాసినాయుడు ఇంటిదగ్గర కనిపించకుండా మద్యంమత్తులో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతుకుతున్నప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో శుక్రవారం విశాఖ గ్రామీణ బ్యాంకు మేడమీదపై నుంచి దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి నాలుగురోజుల క్రితమే మద్యం ఎక్కువై చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతునికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతిగృహ విద్యార్థికి పాము కాటు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వసతిగృహ విద్యార్థి పురుషోత్తం

చీపురుపల్లి: చీపురుపల్లి సమీకృత వసతి గృహానికి చెందిన పదోతరగతి విద్యార్థి వెంపడాపు పురుషోత్తం శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. ఉదయం సుమారు ఆరున్నర గంటలకు వసతిగృహం నుంచి బయటికి వచ్చిన విద్యార్థికి హాస్టల్ సమీపంలోనే పాము కాటువేసింది. ఆ సమయంలో వసతి గృహంలో సిబ్బంది లేకపోవడంతో తోటి విద్యార్థులు అతనిని ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. కాగా వైద్యుడు డా. కె. కుమార్ మాట్లాడుతూ, విద్యార్థికి విష సర్పం కాటు వేసిందని, అయి నప్పటికీ అతని పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. పురుషోత్తం మాట్లాడుతూ ఇంటి నుంచి నిన్ననే వసతి గృహానికి వచ్చానని, టూత్ బ్రష్ లేకపోవడంతో బయటికి వచ్చానని వివరించాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తహసీల్దార్ ఎన్. రాజారావు, వైసీపీ నాయకులు అనంతరం, శ్రీనివాసనాయుడు తదితరులు పరామర్శించారు. కాగా, పట్టణానికి దూరంగా కొండ ప్రాంతంలో ఉన్న వసతి గృహంలో ఎప్పటికప్పుడు ఇటువంటి సంఘటనలు జరుగుతుండడం పట్ల విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ● దీనిపై హాస్టల్ అడ్మిన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆ సమయంలో తాను హాస్టల్లో లేనని, 6.30 ప్రాంతానికి హాస్టల్‌కు వచ్చి విధుల్లో చేరానని, వెంటనే విద్యార్థిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లానని తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

శృంగవరపుకోట: మండల కేంద్రమైన శృంగవరపుకోట ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అరుకు నుంచి విశాఖపట్నం వైపు తీసుకెళ్తున్న ఆరుకేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. ఈవిషయంపై శుక్రవారం ఆయన మట్లాడుతూ ఎస్ఐ గంగరాజు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఒక స్కూటీని ఆపి తనిఖీచేయగా అల్లూరి జిల్లా అరుకువేలికి చెందిన శెట్టి ఉదయ్‌కుమార్, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఏసు వద్ద గంజాయి గుర్తించామన్నారు. వెంటనే వీరిని అదుపులోకి తీసుకుని ఆరుకేజీలు గంజాయి, స్కూటీ వాహనంతో పాటు ఇద్దరినీ అరెస్ట్ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

అవయవ దానంతో తొమ్మిది మందికి మేలు

● మంత్రి సంధ్యారాణి



ర్యాలీని ప్రారంభిస్తున్న సంధ్యారాణి

సాలూరు: ఒక వ్యక్తి అవయవ దానంతో తొమ్మిది మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవయవ దానంపై శుక్రవారం పట్టణంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో అపోహలు ఉన్నాయని అన్నారు. అందరిముందే అవయవ దానం పత్రాలపై సంతకం చేస్తున్నట్టు ఆమె తెలిపారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు గణేశ్వరరావు, పెంట శ్రీనువాసరావు, సీఐ అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ముఖీ సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఉష, నిర్వాహకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్పాలి

● డీఈవో పగడాలమ్మ



బడి నుంచి పొలం బడి పుస్తకాలను అందిస్తున్న డీఈవో

గరుగుబిల్లి: ఉపాధ్యాయులు ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్పాలని డీఈఓ జి.పగడాలమ్మ సూచించారు. తోటపల్లి జట్టు ట్రస్టు ప్రాంగణంలో మన బడి - మన తోట కార్యక్రమంపై శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు, ముఖ్య సలహాదారు డాక్టర్ డొల్లు పారినాయుడు అధ్యక్షతన 52 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. డీఈవో పగడాలమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో రీజనల్ తీమోటిక్ లీడ్ ప్రకాష్, రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్, డీపీఎం షణ్ముఖరాజు, రిసోర్స్‌పర్సన్లు రైతు వాసుదేవరావు, నల్లా బాలకృష్ణారావు, పక్కి. రవీంద్రనాథ్, మార్కొండ నూకంనాయుడు, ఆర్‌వైఎస్ఎస్ సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్, గాయకుడు వి.సన్యాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

జియ్యమ్మవలస: కన్నపుదొరవలసలోగల ఎంపీపీ పాఠశాలను డీఈఓ పగడాలమ్మ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పిల్లల విద్యా ప్రమాణాలు, వారికి అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సరోజనమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ పసుపురెడ్డి వాణి, యువకులు బంటు సతీష్, పాలకొండ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాక్షికంగా గండి పూడ్చివేత



ఉల్లిభద్ర ప్రాంతంలో రహదారిపై గండిని పూడ్చిన దృశ్యం

గరుగుబిల్లి: ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ కల్వర్టుపై గండిని ఆర్ అండ్ బీ అధికారులు శుక్రవారం పాక్షికంగా పూడ్చారు. వర్షాల కారణంగా రహదారికి ఆనుకొని ఉన్న కొంతభాగం కోతకు గురై గండి పడింది. ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. పూర్తి స్థాయిలో పనులు చేపట్టకుంటే ప్రమాదం తప్పదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ హయాంలో రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ప్రధాన రహదారితో పాటు కల్వర్టు నిర్మాణాలపై దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పీఎం జన్‌మన్‌తో అభివృద్ధి

సీతంపేట రూరల్: పీఎం జన్‌మన్ ద్వారా పీవీటీజీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీడీఏ ఏపీవో చినబాబు తెలిపారు. శుక్రవారం పీఎం జన్‌మన్‌పై అవగాహన సదస్సులను నిర్వహించారు. జేపీ దీసరిగూడలో నిర్వ హించిన సదస్సులో ఏపీవో మాట్లాడారు. పీఎం జన్‌మాన్‌లో 11 రకాల పథకాల ద్వారా పీవీటీజీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయు ష్మాన్ భారత్ కార్డులను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గిరిజన రైతు లకు అల్లం విత్తనాలను ఏపీవో పంపిణీ చేశారు. అనంతరం జగతిపల్లి జీపీఎస్ పాఠశాలను సందర్శించారు. వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ సంజీవరావు పాల్గొన్నారు.

ఒడిశా

గంజాయి స్వాధీనం

రాయగడ: ఢిల్లీ తరలించేందుకు రెండు సూట్ కేసుల్లో సిద్ధంగా ఉంచిన 41కిలోల 600గ్రాముల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ వద్ద అనుమానస్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా, గంజాయిని ఢిల్లీకి తరలిస్తున్నట్టు నిందితులు అంగీకరించారు. నిందితులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ నఫిజ్, ఉసామా అన్సారిలుగా గుర్తించామని పోలీసులు తెలిపారు.

జన్‌మన్ యోజన ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ పారుల్, సబ్‌కలెక్టర్ సంఘమిత్ర

రాయగడ: గిరిజన తెగలు, కుటుంబాల బహుళ ప్రయోజనం కోసం అవగాహన కల్పించేందుకు ప్రధానమంత్రి జన్‌మన్ పరియోజన చైతన్య రథాన్ని జిల్లా కలెక్టర్ పారుల్ పట్వార్ శుక్రవారం జెండాఊపి ప్రారంభించారు. తొలుత జడ్పీ సమావేశ భవనంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల ఆధార్ కార్డు నమోదు, ప్రధానమంత్రి జనధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆయుష్మాన్ భారత్ యోజన, విద్యార్థుల స్కాలర్‌షిప్, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్ సెల్ టవర్ల నిర్మాణం వంటి ప్రయోజానలపై చర్చించారు. అనంతరం చైతన్య రథం ప్రారంభించారు. ఈ రథం, గుణుపురం, బిషంకటక్, మునిగుడ, కళ్యాణ సింగుపూర్ సమితుల్లో 15 పంచాయతీ పరిధిలో మొత్తం 237 గ్రామాల్లో పర్యటిస్తుందని పేర్కొన్నారు. ఈ చైతన్య కార్యక్రమం ఆగస్టు 23 నుంచి సెప్టెంబరు 10 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రాయగడ: భారతీయ జనతా పార్టీ శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించింది. స్థానిక సెరిగుడలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శివపట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల బిజూ జనతాదళ్ నుంచి బీజేపీలో చేరిన సీనియర్ రాజకీయ నాయకుడు వై.వెంకటేశ్వరరావు అలియాస్ కొండబాబు తొలిసారిగా ఈ సభలో పాల్గొన్నారు. ఈయనకు బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సభలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణిమ కర్కట్ మాట్లాడుతూ కొండబాబు పార్టీలో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. కోటి మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికి 40 లక్షలు నమోదు అయ్యాయని, మిగతా సభ్యత్వ నమోదు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పూర్ణిమ నాయక్, బసంత ఉలకా పద్మనాభ చౌదురి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో లక్ష కుంకుమార్చన



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయగడ: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక న్యూ కాలనీలోని సత్యసాయిబాబా మందిరంలో లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ప్రముఖ ప్రవచన కర్త భళ్లమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పెద్దపీట

● వెంకంపేట గ్రామ సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వెంకంపేటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాయన్నారు. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 29 అంశాలు పంచాయతీలు పరిష్కరించుకునే వీలుందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో పడతాయన్నారు. గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన పనులను సభల ద్వారా గుర్తించి ప్రాధాన్య క్రమంలో వాటిని నెరవేర్చాల్సి ఉందని తెలిపారు. మరుగుదొడ్లు, రక్షిత నీరు, వీధి దీపాలు, లింక్ రోడ్లు, రహదారుల మరమ్మతులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు గ్రామ పంచాయతీల బలోపేతానికి కట్టుబడి ఉన్నారని మంత్రి తెలిపారు. ఒకటో తేదీన ఇంటింటికీ సామాజిక పింఛన్లు అందిస్తున్న ఘనత కూట మి సర్కారుకే దక్కుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పంచాయ తీలను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వలసలను నియంత్రిస్తామని, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆసుపత్రుల్లో మౌలిక వసతులకు చర్యలు

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్యుల నియామకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంత్రాల్లో వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు తెలుసుకునేందుకే మన్యం జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, అయితే స్థాయిని మించి ఇన్ పేషెంట్లు ఉన్నారని తెలిపారు. 'మన్యం'లో విభిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. మధ్యలో నిలిచిపోయిన ఆసుపత్రుల భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం జిల్లాలో వైద్య విద్య అందుబాటులోకి తెస్తామని, వైద్య కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వర్చువల్‌గా పాలకొండ రక్త నిధి కేంద్రానికి శిలాఫలకం ఆవిష్కరించారు.

సమస్యలపై వినతులు

బెలగాం: జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌కి శుక్రవారం పలువురు వినతులు ఇచ్చారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ నాయకుడు జీవీఆర్ఎస్ కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య సిబ్బంది తమ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వారిని క్రమద్ధీకరించాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్స్‌కు పదోన్నతులు కల్పించాలని, ఎన్‌హెచ్ఎం జీతాలు పెంచాలని తదితర సమస్యలతో మంత్రికి వినతిపత్రం అందజేశారు. జూనియర్ డాక్టర్లు తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యుల సంఘం నాయకుడు డా.వినోద్ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. గిరిజన ప్రాంతాల్లో ఆసుపత్రి భవనాలు త్వరతిగతిన పూర్తి చేసి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, గౌరమ్మ తదితరులు కోరారు.



మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

జ్ఞాపిక అందజేత

బెలగాం: రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, జేసీ శోభిక.. ఆయనకు అల్లూరి సీతారామరాజు జ్ఞాపికను అందజేశారు.

కేజీబీవీ సందర్శన

సీతానగరం: జోగింపేట కేజీబీవీ పాఠశాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. గదిలో విద్యార్థులు నేలపై కూర్చోవడంతో బెంచీలు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్‌ను, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన ఆయన వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌సీకి సూచించారు. ఇదిలాఉండగా చినరాయుడుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొనకపోవడంతో గ్రామస్థులు నిరాశ చెందారు. ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో హేమలత, మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ

● భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలంతా ఉదయాన్నే ఆలయాల వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వ్రతాలు, అర్చనలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో..



పార్వతీపురంటౌన్: సంతోషిమాత ఆలయంలో..



సీతంపేట రూరల్: సంతోషిమాత దేవాలయంలో కుంకుమార్చనలు

క్లుప్తంగా..

గ్రామసభను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

కురుపాం రూరల్: కురుపాంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌పై కనీసం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి ఫొటో లేదని, ప్రోటోకాల్ పాటించకుండా గ్రామసభ నిర్వహించడం సబబు కాదంటూ టీడీపీ అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మండల అధ్యక్షుడు కలిశెట్టి కొండయ్య, సువ్వాన గోవింద తదితరులు అడ్డుకున్నారు. పోలీసులు సర్దిచెప్పడంతో కొద్దిసేపటి తరువాత సభ కొనసాగించారు. వివిధ పంచాయతీలలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

చెట్టు కొమ్మ తొలగింపు

పాలకొండ: పాలకొండ నుంచి పార్వతీపురం వెళ్లే దారిలో రాజుపేట జంక్షన్ వద్ద చెట్టుకొమ్మ విరిగి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఆ కొమ్మను శుక్రవారం అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

సాలూరు: గంజాయి అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపాలని ఏఎస్పీ సురాన అంకితను రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. శుక్రవారం తనను కలి సిన ఏఎస్పీతో వివిధ అంశాలపై చర్చించారు. గంజాయి రవాణా, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కొఠియా పంచాయతీల్లో గ్రామసభలు



గంజాయిభద్ర గ్రామసభలో పాల్గొన్న స్థానికులు

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని కొఠియా గ్రూపు పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. పట్టుచెన్నారు, పగులుచెన్నారు గ్రామాల్లో సర్పంచ్‌లు చోడిపల్లి కామి, కునేటి కుస్తు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేష్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. గంజాయిభద్ర గ్రామసభ ధూళిభద్రలో సర్పంచ్ గెమ్మెల దివాకర్, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ పనులను ప్రతిపాదించారు. ఈ గ్రామసభలకు పెద్దసంఖ్యలో కొఠియా గ్రూపు గిరిజనులు హాజరయ్యారు.

ఒడిశా ఆరా..

కొఠియా గ్రూపు పంచాయతీల్లో శుక్రవారం జరిగిన గ్రామసభలపై ఒడిశా ఆరా తీసింది. గ్రామసభలు కేవలం కొఠియాలోనే జరిగాయా.. ఏపీ అంతట జరిగాయా.. తదితర వివరాలను ఆరా తీసినట్టు తెలిసింది.

టంగుటూరికి నివాళి



బెలగాం: టంగుటూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ శోభిక



పాలకొండ: గ్రంథాలయంలో..

బెలగాం: స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ శోభిక పాల్గొని, టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కేశవనాయుడు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ● **పాలకొండ:** ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ బబ్బురి గణేష్ ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి... నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు వై.మహేష్, పురుషోత్తం, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సాలూరు: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జి.సింహాద్రి డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు నిరసనగా పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర్యం వచ్చి సుమారు 78 ఏళ్ల గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకపోవడం దారుణమని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

వసతిగృహ పనులు పూర్తిచేయండి



గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రమణ

సీతంపేట రూరల్: సీతంపేట వైటీసీలో ఏర్పాటు చేయనున్న గర్భిణుల వసతిగృహ పనులను త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆదేశించారు. శుక్రవారం ఈ పనులను ఆయన పరిశీలించారు. పనులు పూర్తయిన వెంటనే వసతి గృహాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆయన వెంట ఏపీవో చినబాబు, ఈఈ సింహాచలం, ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని రీజనల్ లీడర్ కె.ప్రకాష్, రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్‌లు అన్నారు. శుక్రవారం దళాయివలస గ్రామంలో డీపీపీ లైన్ పద్ధతులపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీపీఎం మానస, మరడాన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



సాలూరు రూరల్: మామిడిపల్లిలో..

సాలూరు రూరల్: అంతరిక్ష దినోత్సవాన్ని మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు జీఎస్ఎల్‌వీ, చంద్రయాన్ రాకెట్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెంకంపేట ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. 6వ తరగతి విద్యార్థి మణిదీప్ అంతరిక్ష పరిశోధన నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. హెచ్ఎం జి.పరాంకుశంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **సాలూరు:** అంతరిక్ష దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు కేవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాలూరు: వివిధ ఆవిష్కరణలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాలూరు పురపాలక సంఘం

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.15/2023-ఇ1 తే.23.08.2024

సాలూరు పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు eprocurement Portal ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు	:	23 పనులకు
మొత్తం అంచనా విలువ	:	రూ.65.10లక్షలు
టెండరు డాక్యుమెంట్లు అందుబాటులో తేదీ మరియు సమయం	:	తే.24.08.2024ది ఉదయం 11.00గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం	:	తే.09.09.2024ది మధ్యాహ్నం 03.00 గంటల వరకు
టెండర్లు తెరచు తేదీ మరియు సమయం	:	తే.09.09.2024ది మధ్యాహ్నం 04.00 గంటలకు
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు	:	1)కమీషనరు-9849905794 2) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - 9849906992

ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌నందు చూడగలరు.

Sd/- కమీషనరు,
సాలూరు పురపాలక సంఘం

వరదనీటి మళ్లింపునకు ప్రత్యేక కార్యాచరణ

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లోగల పలు కాలనీల్లో వరదనీటి మళ్లింపునకు సంబంధించి బృహత్తర ప్రణాళికలతో పాటు ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వరహాల గెడ్డ పరివాహక ప్రాంతాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వరహాల గెడ్డ వరద ఉధృతికి జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లోగల కాలనీలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. భవిష్యత్తులో కాలనీలకు ముంపు కష్టాలు తీర్చేందుకు సమగ్ర సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ముంపునకు సంబంధించి ఇప్పటికే సర్వే నిర్వహించడం ప్రారంభించారన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు తమ సహాయ సహకారాలను అందిస్తే ముంపు ముప్పు నుంచి ఆయా కాలనీల వాసులను బయటపడేలా చర్యలు చేపడతామని తెలిపారు.



వరహాల గెడ్డ వరద ఉధృతిని పరిశీలిస్తున్న కమిషనర్